క్లుప్తంగా

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



ఆదోని అర్బన్ : పట్టణశి వారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణ మండల ఆంజనేయ స్వామి వారికి శ్రీరామనవమిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం నిత్యప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీ, వడలహారం, నైవేద్యం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు రామకృష్ణ, బి.కె.మల్లికార్జున శెట్టి, వీరేష్, వెంకయ్యశెట్టి, నాగప్ప, అశోక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుద్దాం



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు

పెద్దకడబూరు: ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అందరం కృషి చేద్దామని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై స్థానిక శిక్షణా కేంద్రంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. హోళగుంద మండలం నుంచి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఇంజినీరింగ్, వెటర్నరీ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడ చెత్త నిల్వ లేకుండా చేసి క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ దిశగా పయనిద్దామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించడమే కాక దానిని చెత్త సంపద కేంద్రానికి తరలించాలని సూచించారు. చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణప్ప, పంచాయతీ కార్యదర్శి షాహిద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన పంచాయతీ ఆదాయం

కౌతాళం:కౌతాళం మేజర్ పంచాయతీలో వివిధ పన్నుల వసూళ్లకు వేలం పాటల్ని మంగళవారం డీఎల్‌పీఓ నూర్జహాన్ అధ్యక్షతన కార్యదర్శి నాగరాజు నిర్వహించారు. వేలం పాటల ద్వారా పంచాయతీకి ఆదాయం పెరిగింది. గతేడాది కన్నా రూ.1.86లక్షల అదనపు ఆదాయం సమకూరింది.బండిమెట్ట రూ.4,25,000ఈడిగ వసంత దక్కించుకోగా, కమేల వేలం పాటను ఉపేంద్ర రూ 34,000, దినసరి మార్కెట్ వేలం పాటను రూ.18,500 గురు స్వామి దక్కించుకున్నట్లు కార్యదర్శి తెలిపారు. వేలం దక్కించుకున్న వారు పాట మొత్తాన్ని ఈనెల 31లోపు చెల్లించాలని డీఎల్‌పీఓ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్ ప్రకటనపై హర్షం



మాట్లాడుతున్న ఎంటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్

ఆదోని అర్బన్: మున్సిపల్ యూనిఫైడ్ ఎడ్యుకేషనల్ సర్వీస్ రూల్స్ ప్రకటన పట్ల ఎంటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ సర్వీస్ రూల్స్ ప్రకటన సూచనలను అమలు చేయాలని కోరారు.అన్ని విభాగాల మున్సిపల్ ఉపాధ్యాయులకు సమన్యాయం జరగాలంటే అందరినీ మున్సిపల్ యాజమాన్యం కిందకు తీసుకొని సఫలీకృతం చేయాలని కోరారు. డీఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులు, నాన్ డీఎస్సీ నియామకమైన ఉపాధ్యాయుల సీనియారిటీ విషయం పట్ల తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు అనిల్ కుమార్, దస్తగిరి, మద్దయ్య, కోటన్న, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

ఆదోని అర్బన్: క్రైస్తవులపై దాడులను అరికట్టాలని కోరుతూ మంగళవారం సియోనూ ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో భారీశాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ సంఘాల సేవకులు,పాస్టర్లు, క్రైస్తవులు భారీఎత్తున పాల్గొన్నా రు. స్థానిక సియోనూ ప్రార్థనా మందిరం నుంచి ప్రారంభమైన శాంతిర్యాలీ ఎమ్మిగనూరు సర్కిల్, మున్సిపల్ మెయిన్ రోడ్డు మీదుగా కోట్ల కూడలి, పాత బస్టాండు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి ప్రార్థనా మందిరానికి శాంతిర్యాలీ కొనసాగింది. పాస్టర్లు ప్రకాష్, కుమార్, విజయ్, ఎం.ఎస్.రావు, ఆనంద్, జాషువా, ఫిలిప్ మాట్లాడుతూ కొందరు అనవసరంగా క్రైస్తవులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వ అధికారులను కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

అభివృద్ధి బాటలో కోసిగి



నాడు అధ్వానంగా ఉన్న కాశమ్మ గడ్డ వంక రోడ్డు



రోడ్డు వేయడంతో నేడు ఇలా..

- ప్రతి వార్డులో అభివృద్ధి పనులు
- రూ.కోటితో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు
- ఏళ్ల తరబడి సమస్యల్లో మగ్గుతున్న కాలనీలకు కొత్త శోభ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి వార్డులోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మేజర్ పంచాయతీ కోసిగికి మాత్రమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.కోటి వెచ్చించి డ్రైనేజీ, సీసీ రోడ్లు పనులు చేపట్టారు.

ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కాలనీలు..

ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఎస్సీ కాలనీ, 3వ వార్డు ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి బాటలో దూసుకెళ్తోంది. గతంలో పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా ఆయా కాలనీలు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి సహకారంతో 3వ వార్డులోని కాశమ్మ గడ్డ , బీసీ కాలనీ, నాడుగేని వీధిలోని శ్మశాన వాటిక రోడ్డు డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే కోసిగిలోని సిద్దప్ప పాళెం, మారెమ్మ గుడి, జేబీఎం స్కూల్ సమీపంలో కుమ్మరి వీధి, కడ పాళెం వీధిలోని చింతలగేని వీధి, మైనార్టీ కాలనీ తదితర కాలనీలలోని గల్లీలో కూడా సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఎన్‌ఆర్‌జీఎస్ కింద దాదాపు రూ. కోటి వరకు ఖర్చు చేసి పనులు చేశారు. ఇటీవల టీడీపీ కంచుకోటగా ఉన్న కొండుగానీ వీధి కాలనీలో ప్రజల విన్నపం మేరకు డ్రైనేజీ , సీసీ రోడ్డు వేయించి ఆ కాలనీ వాసుల మన్ననలు పొందారు.



ఇటీవల టీడీపీ కాలనీ కొండుగానీ వీధిలో వేసిన రోడ్డు

గడప గడపకు మంజూరైన నిధులతో..

మేజర్ పంచాయతీ కోసిగిలో 1, 2, 3వ సచివాలయం పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా కాలనీ వార్డులలో నెలకొన్న సమస్యలను గుర్తించారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద ఒక్కో సచివాలయం పరిధిలో రూ.20లక్షలు చొప్పున ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. ఈ నిధులతో 1వ సచివాలయం పరిధిలో బాలుర ఉన్నత పాఠశాల వెనుక భాగం లక్ష్మమ్మవ్వ గుడి దగ్గర, కొండుగాని వీధిలో డ్రైనేజీ, సీసీ రోడ్డు వేయించారు. 2వ సచివాలయం పరిధిలో కడ పాళెం గుడిసెలల్లో మెటల్ రోడ్డు, కాల్వల పనులు ముమ్మరం చేశారు. 3వ సచివాలయం పరిధిలో మార్కండేయ స్వామి ఆలయ కాలనీల్లో రూ.7.50లక్షలతో రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. వీటితో కోసిగిలో వార్డు వార్డులో, కాలనీల్లో, గల్లీలో, మండల గ్రాంటుతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గతంలో ఎన్నడు లేని విధంగా పనులు చేపట్టడంతో ఆయా కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

మా కాలనీకి వెళ్లాలంటే కష్టంగా ఉండేది



కోసిగిలో 3వ వార్డులో కడపాళెంలో నివాసం ఉంటున్నాం. మా కాలనీకి వెళ్లాంటే నరకం చూసే వాళ్లం. రోడ్డు అంతటా ముళ్ల పొదలు, మురుగునీరు నిండి ఉండేది. ఇంటి ముందు దుర్వాసనతో చాల ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం ఎమ్మెల్యే సహకారంతో డ్రైనేజీ, మెటల్ రోడ్డు వేయించారు. దీంతో మా కాలనీకి కొత్త రూపు వచ్చింది. చాల ఏళ్ల తర్వాత మా కాలనీలో రోడ్డు వేయడం సంతోషకరంగా ఉంది.

– సొంటన్న, కడపాళెం వీధి, కోసిగి

ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కోసిగి పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాడు. గ్రామంలో కాలనీ వాసులు వెళ్లి సమస్య ఉందని చెబితే చాలు వెంటనే పరిష్కారానికి కృషి చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గడప గడప నిధులు, ఎమ్మెల్యే గ్రాంటు, మండల గ్రాంటు, పంచాయతీ గ్రాంటు నిధులతో వాడ వాడలా డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయించారు. ఏళ్ల తరబడి సమస్యల్లో మగ్గిన కాలనీలు కూడా కొత్తశోభను సంతరించుకున్నాయి. ఎమ్మెల్యేకు కోసిగి ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు.

– అయ్యమ్మ, గ్రామ సర్పంచ్, కోసిగి

చిరుధాన్యాలతో సంపూర్ణ పోషణ



చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్

కోసిగి: చిరుధాన్యాల వాడకంతో సంపూర్ణ పోషణ పొందవచ్చని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని ప్రాజెక్టుల సీడీపీఓలు నాగమణి, షఫీవున్నీసా బేగం, మద్దమ్మ అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవన సమావేశ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రాజేషల సమక్షంలో పోషణ పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునే విధంగా చైతన్య పరిచి రక్త హీనత లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టు అందించి అంగన్ వాడీ కేంద్రాల ద్వారా వారికి పౌష్టికాహారం పై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ రకాలు పౌష్టికాహార పదార్థాలను తయారు చేసి స్టాల్ గా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏపీఎం సత్యమ్మ, ప్రాజెక్ట్ అసిస్టెంట్ రాజు, ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ సుధావతి, సురేఖ, ప్రీతి, సెక్టార్ లీడర్లు హెప్సిబారాణి, లూసమ్మ, సుజాత పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ'

ఆదోని రూరల్ : దేశ రాజధాని ఢిల్లీలో ఏప్రిల్ 5న జరిగే కార్మిక కర్షక ప్రదర్శనను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్. రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర ధరలను విపరీతంగా పెంచేసి, ప్రభుత్వ రంగసంస్థలను ప్రయివేట్ పరం చేస్తోందన్నారు. కార్మికులకు ఉపాధి అవకాశాలను, పింఛన్ సౌకర్యాన్ని, కనీస వేతన సౌకర్యాన్ని కల్పించడం లేదని చెప్పారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, గోపాల్, ముక్కన్న, వెంకటేష్, మునెప్ప, అజీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: అన్ని పంటలకు మద్దతు ధరలకై పార్లమెంటులో చట్టం చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం బదినేహాల్ గ్రామంలో చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈరన్న, వెంకన్న, సాదఖలి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శంకర్, బడేసాబ్ ఉన్నారు.



ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ఆదోని రూరల్ : పట్టణంలోని నిత్యావసర సరుకుల సరఫరా (ఎంఎల్ఎస్) పాయింట్‌ను మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో నిల్వ ఉన్న స్టాకు, వచ్చిన సరుకులు, సరఫరా చేసిన సరుకుల వివరాలపై ఆరా తీశారు. స్టాకు వివరాల్లో , ప్రజలకు అందజేస్తున్న తూనికల విషయంలో ఎలాంటి తేడాలు వచ్చినా కఠిన చర్యలు తప్పవని స్టాకు పాయింట్ సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటలక్ష్మి, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ వలీబాషా, స్టాకు పాయింట్ గోడౌన్ ఇన్‌చార్జ్ పిల్లై ఉన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ బడేసాహెబ్ తాత నెల ఉరుసు సందర్భంగా గ్రామ పెద్దలు బండలాగుడు పోటీలు నిర్వహించారు. మంగళవారం నెల పూజ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు తిరుమల రెడ్డి, సర్పంచ్ కామర్తి లింగమ్మ, తోలు రాముడు, మహేష్ రెడ్డి న్యూ కేటగిరీ విభాగంలో ఎద్దుల బండలాగుడు పోటీలను పూజ చేసి ప్రారంభించారు. పోటీలకు జిల్లా నుంచి 9 జతల ఎద్దులు పాల్గొన్నాయి. విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు ఐదో బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు రంగారెడ్డి, మణిక్యరెడ్డి పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకొచ్చారని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వబుగ్గ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో రూ.1.61 కోట్లతో నూతనంగా నిర్మించిన వసతి గృహ సముదాయాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మాలిబాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో గతంలో చదివిన పూర్వ విద్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థానాల్లో స్థిరపడటంతోపాటు ప్రతి ఏటా పాఠశాల పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమన్నారు. చదువు విషయంలో ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి మొదలుకొని జీవితంలో స్థిరపడేంత వరకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చుతోందన్నారు. కాగా పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న ప్రహరి గోడను నిర్మించాలని ప్రిన్సిపాల్ మాలిబాషా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అందుకు స్పందించిన ఆయన గోడ నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని తెలిపారు. మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇదే పాఠశాలలోనే ఇంటర్ విద్యను అభ్యసించడానికి జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని కోరగా అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ పీఓ వేణుగోపాల్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ రంగనాథ్‌గౌడు, ఓర్వకల్లు సర్పంచు తోట అనూష తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో వసతి గృహ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

తపాలా బీమాతో ప్రయోజనం

హొళగుంద: తపాలా జీవిత బీమా పథకం గ్రామీణ ప్రజలకు వరంలాంటిదని కర్నూలు పోస్టల్ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన హొళగుందలోని సబ్ పోస్టాఫీసును ఆకస్మిక తనిఖీ చేశారు. పోస్టాఫీసు కార్యకలాపాలు, రికార్డులు, ఉద్యోగుల రోజువారి విధులను పరిశీలించి ఖాతాదారులతో మాట్లాడి అభిప్రాయాలను సేకరించారు. తక్కువ పెట్టుబడితో బీమా చేయించడం వల్ల భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు



మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మహిళలకు పెద్దపీట

- మంత్రాలయంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు
- మహిళలకు చెక్కు అందజేసిన వైఎస్సార్‌సీపీ నేత ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలులో మహిళలకు పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ నేత వై. ప్రదీప్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ ఆసరా సంబరాలు మంత్రాలయంలోని దుర్గారమణ కల్యాణ మండపంలో మంగళవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి మండలాధ్యక్షురాలు వై.గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు మజ్జిగ గోవిందమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరు ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మండలంలోని 726 గ్రూపులకు రూ 3,34,02,000 మెగా చెక్కును వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి చేతుల మీదుగా డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఆయన హయాంలో ఒక్క పాఠశాలైనా మరమ్మతులు చేపట్టారా అని ప్రశ్నించారు. అదే జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నాడు–నేడు పథకంలో గ్రామాల్లో రూపురేఖలు మారిపోయాయన్నారు. మొదటి ప్రాధాన్యత కింద విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేశారని కొనియాడారు. అనంతరం సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలకు తానే స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయసలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఏపీఎం జయశ్రీ, ఎంపీడీవో ప్రభావతి, ఎంఈఓ మోహినుద్దీన్ తదితరులు ఉన్నారు.

నేడు కౌతాళంలో ఆసరా చెక్కు పంపిణీ

కౌతాళం:మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగపు నాయకుడు ప్రదీప్‌రెడ్డి చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు ఏపీఎం రాజశేఖర్ తెలిపారు. మండలంలో మొత్తం 830 పొదుపు గ్రూపులకు 3.26కోట్ల రూపాయల చెక్కులను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచులు పాల్గొనాలని కోరారు.

బీజేపీ ఆదోని కన్వీనర్‌గా ప్రకాష్‌జైన్

ఆదోని అర్బన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు 147 నియోజకవర్గాల్లో కొత్తగా అసెంబ్లీ కన్వీనర్లను నియమించారు. ఈ మేరకు పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ శాసనసభ్యుడు ప్రకాష్‌జైన్‌ను ఆదోని అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ప్రకాష్ జైన్ మాట్లాడుతూ తనపై నమ్మకాన్ని ఉంచి తనకు అసెంబ్లీ కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి అందరినీ కలుపుకుని కృషి చేస్తానన్నారు.

1న బండలాగుడు పోటీలు

చిప్పగిరి: నేమకల్లు గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 1న రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూళం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ ప్రేమ్‌కుమార్, గ్రామ పెద్దలు తెలిపారు. వారు మంగళవారం మాట్లాడుతూ.. ఈ నెల 31న రథోత్సవం, ఏప్రిల్ 1న రాతి దూళం లాగే పోటీలు ఉంటాయన్నారు. విజేతగా నిలిచిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ.30 వేలు తర్వాతి స్థానాలకు రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు చొప్పున దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు.

చెరువు తూము పరిశీలన

పత్తికొండ రూరల్: స్థానిక షాదీఖానా సమీపంలో చెరువు తూమును మంగళవారం ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి పరిశీలించారు. గత కొన్నిరోజుల నుంచి చెరువు కడగొమ్ము, తూము పూడ్చివేతకు గురైందని రైతులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి మట్టితో పూడ్చిన ప్రదేశాన్ని సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఎస్ఈ ఆదేశాల మేరకు మట్టిని తొలగించాలని ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

నేటి నుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో బుధవారం నుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ లింగమ్మ మంగళవారం తెలిపారు. ఆలయంలో బుధ, గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, శుక్రవారం స్వామి వారి రథోత్సవం, శనివారం పూజలు, ఆదివారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తున్నట్లు చెప్పారు.

1న రాష్ట్రస్థాయి భజన పోటీలు

ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీన రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.20 వేలు మొదలుకుని 18 స్థానాల వరకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. అలాగే ఉత్తమ గాయకుడు, హార్మోనిస్టు, తబలిస్టుకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు అదే రోజు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, వివరాలకు సెల్ 90145 53955, 76809 78114 నంబర్లను సంప్రదించాలన్నారు.

వైభవంగా బడేసాహెబ్ స్వామి ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ బడేసాహెబ్ స్వామి నెల ఉరుసు మంగళవారం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారికి ఫాతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్గా కమిటీ సిబ్బంది క్యూలైన్లను ఏర్పాటు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతో మంచినీటి ఇబ్బందులు తప్పాయి. మంగళవారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్గాను దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. సర్పంచ్ రాముడు, మహేష్ రెడ్డి, పూల బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ కిరణ్‌కుమార్

మంత్రాలయం రూరల్:మండల పరిధిలోని మాధవరం గ్రామ శివారులో కోసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన బోయ రమేష్ ద్విచక్ర వాహనంపై కర్ణాటక మద్యం తీసుకుని వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు.అతని వద్ద నుంచి 90ఎంఎల్ 384 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని,ద్విచక్ర వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.నిందితుడిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరుచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని ఎస్‌ఐ వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని తుంగభద్ర నది నుంచి కల్లుదేవకుంట గ్రామానికి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఎమ్మిగనూరు సెబ్ సీఐ జయరాంనాయుడు సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. మంగళవారం ఉదయం ట్రాక్టర్లకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. ట్రాక్టర్లు మంత్రాలయానికి చెందిన నాగేష్, వీరయ్యశెట్టివని తెలిపారు.